# విధవలపట్ల మన కనీస ధర్మం!

ప్రియమైన కుసుమా!

సంక్రాంతినాడు నాయనమ్మతో కలిసి బొబ్బట్లు చేస్తోంటే నీ ఉత్తరం తెచ్చి యిచ్చింది చెల్లి. మీ కాలేజీ విశేషా లన్నిటికంటే నువ్వురాసిన ఆ 'విధవరాలు' బ్రతుకు దుర్భరంగా వుందనిపిస్తుంది. పాపం. సర్వాంగసుంద రంగా అలకరించుకొన్న వాళ్ళకే లోపాలెంచి పిలిచే మీ విద్యార్థులు, మల్లు చీర కట్టుకొని, వెంట్రుకలు ముడేసుకొని చదువుకొచ్చే ఆ అమ్మాయిని ఎగతాళి చేస్తారంటే ఆశ్చర్యం ఏముంది? నిజం మాట్లాడాలంటే మనం మాత్రం అటువంటివాళ్ల పట్ల ఏం సానుభూతి చూపుతున్నాం? నీ ఉత్తరం అందగానే జవాబు వ్రాయమన్నావు కాదూ? ఏమంత గొడవలుంటాయి— తరచు ఉత్తరాలు రాయటానికి? ఏదో పిచ్చాపాటీ మాట్లాట్టం తప్ప. అందుకే మా వూళ్లో పేరంటాళ్ల గురించి కొంత చెప్తాను. మా వూళ్లోనేగాదులే, ప్రతిచోటా వుండేగొడవలే యివి.

* * *

భోగినాటి సాయంత్రం మా యింట్లో చిన్న పేరంటం జరిగింది పేరంటాళ్లకి పళ్లు పంచిపెట్టుకోవటం అన్నమాట, ఈ సారి పెద్దపండగ మంగళవారము వచ్చిందికదూ? అందుకని భోగినాడే పేరంటం. కుంకుం భరిణె తీసుకుని నేనే వెళ్లాను పిలుపుకు.

ఆ అమ్మాయికి యిరవై ఏళ్ళైనా వుండవు. ఐనా పేరంటాళ్ళతో పోగొట్టుకొంది. అటువంటి వాళ్లని పేరంటానికి పిలవరని నాకు తెలుసు. కానీ మా స్నేహాన్నిబట్టి నేను సంశయించకుండా పిలిస్తే వస్తుందను

కున్నాను. "రాను, రాకూడదు-" అంది. "రాకూడదని నాకూ తెలుసు. కాని నా కా శంక లేమీలేవు. నువ్వొచ్చేది మా యింటికిగదా. అందర్నీ పిలిచినట్టు నిన్నూ పిలుస్తున్నాను-" అని బలవంతం చేశాను.

"నీ కభ్యంతరం లేకపోతే మీవాళ్లకుంటుంది. మీ నాయనమ్మ, మీ అమ్మ ఏమైనా అనుకుంటారు. వాళ్లూరుకున్నా నేను పేరంటాని కొస్తే మిగతా పేరంటాళ్లంతా ముక్కు-మీద వేళ్లేసుకుంటారు. ఎందుకు నన్ననవస రంగా నవ్వులపాలు చేస్తావ్? నే రాకూడదు. నా కా అర్హత లేదు-" అంది విచారంగా.

"అదేమిటి? తను మా యింటికొస్తే మిగిలినవాళ్ళ కెందుకు?" ఈ మాటే అడిగాను — "కాసేపు ఆనందంగా గడపటానికి వాళ్ళని పిలుస్తాం కదా! కానీ వాళ్ళకింష్టంలేని ఏర్పాట్లు చేస్తే ముళ్ళమీద నించున్నట్లు నించుం టారు. అది మనకేం బావుంటుంది? కిందటేడాది — మా చెల్లెలు పెళ్ళిలో ఏం జరిగిందో తెలిసికూడా నన్ను పేరంటానికి రమ్మని ఎలా అడుగు తున్నావు —" అంది దీనంగా.

నిజమే పాపం! నేను పిలిస్తేమట్టుకు అటువంటి పేరంటాళ్లలోకెలా వస్తుంది! క్రిందటేడాది వాళ్ల చెల్లి పెళ్ళిలో ఈవిడ కూడా నలుగురితో పాటు తెలిసో తెలీకో భోజనానికి బంతిలో కూర్చుంది. స్వంతయిల్లేకదా అని ధైర్యం చేసి వుంటుంది. కాని ఎంత పొరపాటు మిగతా వాళ్ళలో దృష్టిలో? వడ్డనై పోయినా పెద్ద ముత్తైదువు విస్తటిలో చేతులెట్టడం లేదు. "మళ్ళా బంతిలో కూర్చుంటామనీ," "పిల్లలేడుస్తున్నారు పాలివ్వాలనీ," "తల నొప్పిగా వుందనీ," -- కొంత మంది లేచిపోయారు.

విధవ మనిషితో కలిసి బంతి బోజనం చేస్తే అశుభమట. అదీ వాళ్ల భయం. మూతులు విరవటం. గుసగుసలాడటం. ఒళ్లంతా కళ్ళు చేసుకుని

ఆవిణ్ని చిత్రంగా చూట్టం. ఒకటేమిటి? ఈ సంగతి అంచీల మీద ఆవిడ అమ్మమ్మకి తెలిసింది. అందరు తననే పొడిచి పొడిచి చూస్తూన్నారని బిత్తరబోతున్న అమ్మాయిని — "పునిస్త్రీ వాళ్ళతో నువ్వెందుకే? దిష్టి పిడతలా, పద లోపలికి" — అంటూ వాళ్ళమ్మమ్మ లాక్కుపోయింది. ఆ అవమానికి పాపం ఆవిడ తలెత్తుకోలేక పోయింది — కొన్నాళ్ళు. తోటి ఆడదాని పట్ల అంత హీనాతిహీనంగా ప్రవర్తించేవాళ్ళ మధ్య కెలా వచ్చి నిలబడుతుంది?

కాని కుసుమా! మనం ఒక విషయం ఆలోచిస్తే అటువంటి వాళ్ళ పట్ల ఇంత కర్కశంగా వుండలేం. మనం మన భవిష్యత్తు యిష్టానుసారంగా నిర్ణయించుకోలేం కదా! విధెలా మారుతుందో తెలుసుకోలేం కదా! అటువంటప్పుడు విధవలపట్ల హేళనెందుకు? మనం వాళ్ళ స్థానంలో ఉంటే .... మనని మిగతా వాళ్ళంతా చులకనగా, అసహ్యంగా చూస్తే .... మనస్సెలా ఉంటుంది?

నేను పెద్ద సంస్కర్తలా తలకి మించిన కబుర్లు చెప్పటం లేదు. కేవలం నేను చెప్పేదేమిటంటే అటువంటి వాళ్ళ పట్ల సానుభూతి చూపాలని, వాళ్లు కనపడగానే అపశకునంగా భావించకుండా జాలిగా చూడాలని. అలా చేస్తే మోడైపోయిన జీవితాలలోనైనా వాళ్లు కొంచెం తృప్తి పొందగల్గుతారు.

ప్రొద్దుటే లేచినప్పుడుగానీ, పొరుగూరు వెళ్లేటప్పుడుగానీ, శుభ కార్యాలలోగానీ, వాళ్లు కనపడితే విసుక్కుంటారు. అక్కడికీ సగంచచ్చి తప్పుకునే తిరుగుతారు వీళ్లు. కాని మనిషంత మనుషులు నల్లపూస లవలేరు కదా ? వయసు మళ్లాక విధవరికం పొందటం ఒకరకంగానీ, బొత్తిగా చిన్నతనంలో, వయసులో యిలా సంభవించటం భరించరాని కష్టం. ఐనా జీవ

చ్చవాళ్లా బ్రతుకుతూనే వుంటారు. "వెధవముండకి అంత తెల్లటి చీర లెందుకమ్మా ?"

"అది సబ్బుతోగానీ స్నానం చెయ్యాదట--" అంటూ చెప్పుకొంటాం గదా, పరిశుభ్రంగా వుండటంకూడా తప్పేనా ? తోటి ఆడవాళ్లమైన మనం అటువంటి వాళ్లపట్ల కనీసం సానుభూతైనా చూపలేక పోతున్నామంటే పైగా వాళ్ల ప్రతి పనినీ నిశితంగా పరిశీలించి వాళ్లకేదో ఒక లోపం అంటగడుతున్నామంటే ఎంత సిగ్గుచేటు ? మన పదవి మనకి శాశ్వతమా? అని ఎందుకాలోచించుకోము. ఇంతకీ భోగినాటి సాయంత్రం ఆవిడ రానే లేదు. వాళ్ల అమ్మమ్మ వచ్చింది. అవును మరి యిరవై యేళ్ల వాళ్ల మనవ రాలికి లేని పేరంటార్హత అరవై ఏళ్ల వాళ్లమ్మమ్మకి ఉంది. తరతరాలుగా పాతుకుపోయిన ఆచారాన్ని ఒక్కసారిగా త్రోసిరా జని విధవలకి పేరం టార్హత యిప్పించలేమేమోగానీ కనీసం వాళ్ల దౌర్భాగ్యానికి సానుభూతైనా చూపలేమా ? ఈ సారి నే నొచ్చినపుడు మీ కాలేజీలో చదువుకొంటున్న ఆ అమ్మాయిని చూస్తాను-

అనూరాధ ।

(2-3-1958 తేదీ "ప్రజామత" నుంచి)

—:o:—